చీర కాళ్ళ కడ్డంబడుతోంది కాళ్ళులాగుతున్నాయి. నీరసంగావుంది. ఆకలేస్తోంది.

అన్నమయినా పెట్టించలేదు. దొంగ వెధవ....తను మాత్రం తెగతాగాడు, తెగ తిన్నాడు....అందుకే అంతబలిసాడు దున్న పోతులాగా.... నేను మాంసం తిననని తెలుసు.... తెలిసికూడా – నీకు వేరే ఏమయినా తెప్పించమంటావా అని అడగలేదు.... నా అంతట నేనడిగి తెప్పించుకోడానికి మనస్కరించలేదు.... నాకడుపు మండుతున్నా, వాడు నాఎదటే కూర్చుని వందిలా తింటూవుంటే, చూస్తూ వూరుకున్నాను.

నన్నూ తాగమన్నాడు, నేను తాగనని తెలుసువాడికి....నేనూతాగి, మంచంలోబడితే, తెలవార్లూ వుంచేసుకోవచ్చునని వాడి ఎత్తు.... నేనంత వెర్రిదాన్నేమీ కాదు.

రిక్షా ఎక్కినా పోయేది.... ఇంతసేపులే, అలవాటయిన నడకేగదా అనుకుంటే,ఎంతకీ తరగటంలేదు....మామూలుగా అయితే ఈ పాటికి ఇంటికి చేరేదాన్నే....కాని,ఇవ్వాళ్ళ పొద్దున్నెప్పుడో తొమ్మిదింటికి తిన్న అన్నం.... ఆఫీసులో ఆరుగంటల్దాకా చాకిరీ....ఆ తర్వాత వాడితో....

తిండిలేదు....విశ్రాంతిలేదు. మధ్యలో రెండు సార్లు కాఫీ నీళ్ళు తాగాను. అంతే.

చీర బాగా నలిగి పోయింది ..రేపుమళ్ళీ కట్టుకోడానికి పనికిరాదు....రేపు ఆఫీసుకి ఏం కట్టుకెళ్ళాలో ఏమో. నాకున్నవే ఆరేడు....అందులో చెల్లెళ్ళిద్దరూ, చెప్పా చెయ్యకుండా చెరోటీ కట్టుకుపోతుంటారు... చెప్పినా వినరు....'మాక్కూడా చీరలు కొని పెట్టు....నీవి ముట్టుకోం....' అంటారు.... ఎక్కణ్ణించి తేను....?

వందరూపాయలివ్వటానికి ఏడిచాడు వెధవ....అంతా అయినాక. రేపు తీసుకోకూడదా డార్లింగ్....ఎల్లుండి ఇస్తాలే డియర్....ఇవ్వాళ నాక్కొంచెం అవసరముంది ..' -అంటూ దొంగవేషాలు మొదలెట్టాడు ...నేను వదల్లేదు....'నేనువచ్చింది మీడబ్బుకోసంకాదు... మీకోసం....మీరంటే ఇష్టం కాబట్టి ... కాని....'-అంటూ,నేనూ నటించాను. ఇప్పుడిప్పుడే నేనూ నటించటం నేర్చుకుంటున్నాను.

ఇప్పుడింటికెళ్ళగానే అమ్మ ముందూ, నాన్నగారిముందూ, చెల్లెళ్ళముందూ–ఆఫీసులో ఓవర్‌టైమ్ చేసి, అలిసిపోయి వస్తున్నట్టు నటించాలి. అలిసి పోయినమాట నిజమే, అందుకు నటించక్కర్లేదు.

నిన్న, మొన్నటి దాకా ఎంత అమాయకంగా వుండే దాన్ని.... ఎంత వెర్రిదానిలా వుండే దాన్ని.... అలాంటి దాన్ని యిప్పుడెన్ని నటనలు నేర్చాను. ఎన్నిపనులు తల్చుకుంటే నవ్వొస్తోంది; అంతకు మించి ఏడు పొస్తోంది, కాని – ఏడు పొచ్చి నవ్వు దల్లా పైకనకుండా వుండటం కూడా యిప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాను.

o o o o

ముందు గదిలో చీకటిగా వుంది.

బల్బు మాడిపోయి రెండు రోజులయింది; ఇవ్వాళ ఆఫీసు నుంచి ఇంటి కొచ్చేప్పుడు తెద్దామనుకున్నాను: మర్చి పోయాను.... ఆఫీసు నుంచి సరాసరి ఇంటి కొస్తే గుర్తుండేదేమో....

నాన్నగారు ఆ చీకట్లోనే కూర్చుని వున్నారు; కాండిలయినా లేదు.... ఇంటో అవీ లేవనుకుంటాను....

"ఏమిటమ్మా ఇంత లేటయింది...."– అని కూడా అడగలేదు నాన్నగారు, ఆయన అడగరు. కన్న బిడ్డల్ని, కట్టుకున్న భార్యనే కాదు... ఆయనెప్పుడూ ఎవర్నీ ఏమీ అడగరు; ఏదేమిటని ప్రశ్నించరు.

ప్రశ్నలు వెయ్యటమనేది అసలాయన కెప్పుడూ చాతకాదనుకుంటాను.

అందుకే కేవలం ఆయన చాతకాని తనం వల్లనే నలభై ఏళ్లు పని చేసినా, నాలుగొందల గుమాస్తాగానే రిటైరయ్యారవి – అమ్మ యిప్పటికీ సాధిస్తూవుంటుంది.

"భోంచేశారా నాన్నగారూ...."–అని అడుగుదామనుకున్నాను — అడగలేక పోయాను.... నోరు పెగల్లేదు....ఎందుకో భయమేసింది .... ఆయన నన్నెప్పుడూ ఏమీ అనకపోయినా, ఏమీ అడక్కపోయినా—ఇంట్లో నేను భయపడేది నాన్నగారి కొక్కరికే....ఆయన్నలా చీకట్లోనే వదిలేసి మెల్లగా లోపలికెళ్ళాను.

వంటింట్లో భోజనాలవుతున్నాయి. చెల్లెళ్లూ తమ్ముడూ తింటున్నారు' సామాన్యంగా నేను రాందే వాళ్ళు తినరు. నా కోసం చూసిచూసి, ఇప్పుడే కూర్చున్నట్టున్నారు.

నన్ను చూడగానే—'రావే, నీక్కూడా వడ్డిస్తాను....' — అంది అమ్మ. ఇంత ఆలస్యమెందుకయిందని అడుగుతుందేమో ననుకున్నాను, అడగలేదు. నేను వెళ్ళి భోజనాల దగ్గర కూర్చునేసరికి — చెల్లెళ్ళూ తమ్ముడూ—కబుర్లూ నవ్వులూ ఆపేశారు. మాట్లాడకుండా తింటున్నారు; మధ్య మధ్యలో నాకేసి బెదురు బెదురుగా చూస్తున్నారు. నాన్నకీ అమ్మకీ జడవరు వాళ్ళు. నేనంటేనే భయం.

సంపాదించి పోషిస్తున్నానని కొద్దిగా గౌరవం కూడా వుందేమో.


తిట్టినా, కొట్టినా, వెట్టిచాకరీ చేయించుకున్నా–ఈ దేశంలో పెళ్ళాలు మొగుళ్ళ ముందు వినయంగా, భయంగా, భక్తిగా వుంటారు. ఎందుకు? తిండికీ బట్టకీ ఆ మొగుళ్ళ సంపాదన మీద ఆధారపడి బతకటం వల్లనే గదా? - అలాగే వీళ్ళూనూ.

ఇంటికి రాగానే–'అక్కా, వచ్చావా' అంటూ. ఒక్కరూ ఎదురురారు; పక్కన కూర్చుని కబుర్లు చెప్పరు; నేను పక్కనుంటే ఫక్కుమని నవ్వరు. అప్పుడప్పుడూ ఏడుస్తారు–వాళ్ళని కోప్పడితేనూ, కసిరితేనూ, వాళ్ళడిగినవి కొనిపెట్టకపోతేనూ, వాళ్ళడిగినప్పుడు డబ్బులేదంటేనూ.

ఈ మధ్య నేనూ అంతే. నేనూ మా వాళ్ళకి తగ్గట్టుగానే తయారయ్యాను. నవ్వటం నేనూ మరచిపోయాను. అమ్మా, నాన్న, చెల్లీ, తమ్ముడూ అంటూ ఆప్యాయంగా పలకరించడం మరిచిపోయాను. కటువుగా తప్ప కమ్మగా మాట్లాడ్డం

# నిద్రకవటం లేదు

## పి. వెంకట్రామయ్య



మరిచిపోయాము. బ్రతికున్న సంగతే మరిచిపోయాము. సగానికి పైగా చచ్చిపోయాను.

చెల్లెళ్ళకి తమ్ముడికీ వున్నట్టుగానే– అమ్మకి కూడా నా మీద కొంత 'గౌరవం' వుంది.

తమ్ముడడిగితే వెయ్యకుండా గిన్నెలో వున్న నెయ్యి నాలుగు చుక్కలూ నా పళ్ళెంలోకి వొంపింది.

ఇవ్వాల్టితో ఇంట్లో నెయ్యి నిండుకుందన్నమాట రేపు కొనాలి. ఈ కంపు నెయ్యి ఇరవై రెండు రూపాయలు.

ఇంత ఆలస్యమైందేమిటని అమ్మ ఇప్పటికీ అడగలేదు. అంటే ఇంకాస్సేపట్లో ఇంకేదో అడుగుతుంది. బహుశా, రేపు నెయ్యి కొనడానికి డబ్బులిమ్మని అడుగుతుంది; బియ్యం ఇంకా నాల్రోజులే వస్తాయని చెబుతుంది; ఈ నెల కరెంటు బిల్లూ, వాటర్ బిల్లూ ఇంకా కట్టలేదని గుర్తు చేస్తుంది. తననీ– ఈ నెలలోనయినా కాస్త కళ్ళడాక్టరు దగ్గరికి తీసుకెళ్ళు తల్లీ,– అని వేడుకుంటుంది.

కూర ఏ మాత్రం బాగుండలేదు. ఉప్పు లేదు; కారంలేదు, రుచిలేదు గొంతుదిగటం లేదు ముద్ద ముద్దకీ నీళ్ళుతాగుతూ అలాగే నాలుగు ముద్దలు తిన్నాను. అమ్మ చారు పోసింది. అదీ బాగుండలేదు.

అమ్మ అడగాల్సినవన్నీ అడిగేసింది. అన్నీ విన్నాను. కొన్నిటికి వూఁకొట్టి వూరుకున్నాను. కొన్నిటికి 'అలాగే' అన్నాను. కొన్నిటికి ఏమీ అనలేదు.

పేరుకి పెరుగేగాని, మజ్జిగకంటే హీనంగావుంది. ఎంత ఆకలితో వచ్చినదాన్ని అసలు అన్నమే తిన్లేకపోయాను. ఆకలి చచ్చిపోయింది. కడుపునిండిపోయింది. చెయ్యికడుక్కు లేచాను.

వొళ్ళు పచ్చిపుండులా వుంది; కళ్ళు కూరుకు పోతున్నాయి; నిద్రముంచుకొస్తోంది. మనిషి ననుకున్నాడో, మర బొమ్మ ననుకున్నాడో – ఆ భండారుడు వొళ్ళంతా హూనం చేసి వదిలాడు. ఇక ఛస్తే వాడి దగ్గరకి వెళ్ళకూడదు.

నాన్నగారు పడుకున్నట్టున్నారు; ముందు గదిలో ఎక్కడా అలికిడి లేదు. అమ్మ వంటింట్లో అన్నం తింటోంది. తిన్నాక, అంట్లన్నీతోమి, అన్నీ సర్ది అప్పుడు పడుకుంటుంది. తెల్లారగట్ల నాలుగింటికో నాలుగున్నరకో లేస్తుంది. అప్పట్నించి రాత్రి పది గంటల్దాకా, పని చేసింది చేసినట్టే వుంటుంది. ఎంత చేసినా ఆ పని తెమలదు.

'నువ్వు కూర్చోమ్మా, నే వడ్డిస్తాను' అని వెళ్ళి, అమ్మకి అన్నం పెట్టి, అయ్యేదాకా పక్కన కూచుందామని పించింది కాని వెళ్ళలేదు.

తమ్ముడు చాప పరుచుకుని, పుస్తకం ముందేసుకూచున్నాడు. ఏం చదవాలో తెలీకనో ఏమో–గంట సేపు పుస్తకాలన్నీ కెలికి, చివరికేవో రెండు పుస్తకాలు

కుని, చిన్న చెల్లెలు కూడా తమ్ముడి ప్రక్కన చేరింది. పెద్దది పక్కలు సర్దుతోంది.

అప్పుడు చూశాను. అనుకున్నట్టే అయ్యింది. పెద్ద చెల్లెలు నా చీర కట్టుకుంది. రేపది ఆఫీసుకి కట్టుకెళ్దామనుకున్నాను. ఇక పనికిరాదు.

పొద్దునెప్పుడు కట్టిందో ఇంతవరకు విప్పనయినా లేదు. ఇప్పుడట్లాగే ఆ చీరతోనే పడుకునేట్టుంది.

ఒక్కసారిగా నా కెక్కడలేని కోపమూ వచ్చింది; కస్సుమని లేచాను; గట్టిగా అరిచాను: నోటికొచ్చినట్టల్లా తిట్టాను; ఏమైందే అంటూ అమ్మ అన్నం దగ్గర్నించి లేచి వచ్చింది. చిన్న చెల్లెలూ, తమ్ముడూ నా వంక భయం భయంగా, గుడ్లప్పగించి చూస్తూ కూర్చున్నారు. ఎంత అరిచి ఎన్ని తిట్టినా పెద్ద చెల్లెలు ఏమీ అనలేదు. తలొంచుకుంది. కంట తడిపెట్టింది. అంతా అయినాక-ఏడుపు దిగమింగుతూ, మెల్లగా-'ఏం చెయ్యనక్కా.... ఇంకో చీరలేదు.... ఇవాళ మా ఫ్రెండ్స్ వాళ్ళింట్లో ఏదో ఫంక్షనుంటేనూ.... నీతో అన్న చెప్పాగా....' అంది.

అవును, చెప్పింది. అసలు బొత్తిగా చీరలు లేవక్కా, అన్నీ చిరిగి పోయాయని చెప్పింది; కనీసం నాకోటీ చెల్లి కోటీ రెండు చీరె లయినా కొని పెట్టక్కా అని అడిగింది. ఎల్లుండి ఫంక్షన్‌కి నీ చీర కట్టుకెళ్తానక్కా అని కూడా చెప్పింది.

పెద్ద దాన్ని వదిలేసి, చిన్న వాళ్ళిద్దర్నీ కాసేపు తిట్టాను; సరిగా చదవటం లేదనీ, ఆ మాత్రం శ్రద్ధలేకపోతే అసలు చదువే మానెయ్యమనీ తిట్టాను.

వాళ్ళు ఎదురు చెప్పలేదు; వొంచిన తలలు ఎత్తలేదు. అమ్మ నా ధోరణి చూసి ఏమీ అనలేక పోయింది. మళ్ళీ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

o o o

నిద్ర రావటం లేదు.

ముంచుకొస్తోందనుకున్న నిద్ర ఏమైపోయిందో తెలీదు. కళ్ళు మండుతున్నాయి. పక్కింటి గడియారం పన్నెండు కొట్టి చాలా సేపయింది. ఈ పాటికి వొంటిగంట అయ్యుంటుంది. ఎంత సేపు కళ్ళు వాల్చుకున్నా, మంచమ్మీద ఎంత దొర్లినా నిద్ర రావటం లేదు. పక్క మంచమ్మీద చెల్లెళ్ళిద్దరూ పడుకున్నారు. అమ్మ, తమ్ముడూ చాపమీద పడుకున్నారు.

మంచమ్మీంచి దిగి, కాసేపు అటూ యిటూ అడుగేద్దామా అనిపిస్తోంది. రెండు మంచాలూ, చాపా వెయ్యగా, ఈ గదిలో ఇంక అడుగు మోపడానికి కూడా చోటు లేదు. ఇంకెక్కడ తిరగాలి? ఇక వంటింట్లోకి వెళ్ళి తిరగాలి....

లేచి, మంచమ్మీదనే గోడ కానుకుని కూర్చున్నాను. గాలిలేదు.... ఉక్కగా ఉంది.. ఫాన్ కొందామని ఎన్నాళ్ళనించో అనుకుంటున్నాను... కుదరలేదు.... ఆ కిటికీ___ గూడులా వుంది గాని. కిటికీలా లేదు. అందులోంచి గాలి రావటం లేదుగాని, బయటి వెల్తురు కొద్దిగా లోపలికొస్తోంది.

తమ్ముడు అమ్మని కరుచుకు పడుకున్నాడు.

'చెప్పులు తెగిపోయినై. కొత్తవి కొని పెట్టక్కా___' అని వారం రోజుల క్రితం అడిగాడు. అప్పట్నించీ రోజూ ఒక సారయినా అడుగుతూనే వున్నాడు. నేను తిట్టకుండా వుంటే, ఇందాకా అడిగేవాడే.. అనవసరంగా తిట్టాను. వాడు బాగానే చదువుతాడు.. చిన్న చెల్లెలూ బాగానే చదువుతుంది .. అది ఈ సంవత్సరం బీయస్సీలో చేరింది....దానికీ చెప్పులు కావాలి.... బుక్స్ కావాలి....చీరలుకావాలి.. బాగ్ కావాలి...

పెద్దది నిద్దరలో కలవరిస్తోంది .... ఏమిటో అంటోంది ....' కాదక్కా ....' అంటోంది ... ఇంకేమిటో అంటోంది.... నిద్రలోనే ఏడుస్తోంది....లేపుదామా అనుకున్నాను.... లేపలేదు.... కాస్సేపటికి అదే మానేసింది....దానికి చదువు రాలేదు....అతి కష్టంమీద పదో తరగతి పాసయింది.... ఇంటర్లో చేరి ఒక సంవత్సరం చదివి ఇక నావల్ల కాదని మానేసింది....అప్పట్నించీ ఖాళీగానే వుంది .... టైపూ షార్టుహేండూ నేర్చుకుంటోంది....మూడేళ్ళనించి వెతుకుతున్నా ఎక్కడా ఉద్యోగం రాలేదు.... పెళ్ళీడొచ్చింది.

పెద్ద దానికీ చిన్న దానికీ సంవత్సరం న్నరే తేడా వయసులో....దానికీ పెళ్ళీడొచ్చినట్టే ... లేదా వస్తున్నట్టు.... పెద్ద చెల్లెలుకంటే నేను ఆరేళ్ళు పెద్దదాన్ని.... నాకూ పెళ్ళీడొచ్చినట్టే... ఆరేళ్ళ క్రితమే వచ్చినట్టు....

ఆరేళ్ళ క్రితం చేరిన ఉద్యోగానికి ఇప్పటికి నాలుగొందలొస్తోంది జీతం....నాన్నగారి పెన్షన్ నూట పాతిక....

ఇవ్వాళ "సంపాదించిన" వందా రేపు అమ్మ కివ్వాలి....అమ్మ ఇందాక చదివిన జాబితాకే అది సరిపోతుందో లేదో....ఈ ఈ నెలలో నయినా చెల్లెళ్ళకి చీరలు కొనాలి.' ముందు తమ్ముడికి చెప్పులు కొనాలి.... చిన్నదానికి బుక్స్ కొనాలి....అమ్మని కళ్ళ డాక్టర్ దగ్గరకి....

"వాడు" మళ్ళీ నాల్రోజుల తర్వాత వస్తానన్నాడు....ఫోన్ చెయ్యమన్నాడు.. కార్డు యిచ్చాడు....ఎక్కడో వుండాలి.... బాగ్‌లో వేశానో లేదో....పొద్దున లేవగానే చూడాలి....ఫోన్ చెయ్యాలి....

పెద్ద చెల్లెలు మళ్ళీ కలవరిస్తోంది.... పక్కింటి గడియారం రెండు కొట్టింది. గాలి లేదు; నిద్ర రావటం లేదు.

ఈ రాత్రికింక నిద్ర పట్టేట్టు లేదు.

o—o

